సాక్షి
మంచిర్యాల

మంగళవారం ၊ 3 ၊ అక్టోబర్ ၊ 2023



కార్మికశాఖలో అక్రమాలకు చెక్

కార్మికశాఖలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆ శాఖ ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తూ సరికొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. కార్మికుడి వేలి ముద్ర లేనిదే లేబర్ కార్డు పొందలేరు. 8లో▸



పత్తికి చీడపీడల బెడద

వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి పంటకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యలను చెన్నూర్ ఏవో కవిత వివరించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

లక్సెట్టిపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల వల్ల ఉల్లాసాన్ని పొందుతారని, క్రీడల్లో ధ్రువీకరణ పత్రాలు ఉన్నత చదువులకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి, కౌన్సిలర్ చాతరాజు రాజన్న పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



రాస్తారోకో చేస్తున్న రైతులు

జన్నారం: నాలుగు రోజులుగా యూరియా కోసం తిరుగుతున్నా నిల్వ లేదని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు సోమవారం రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయం ఎదుట రహదారిపై బైఠాయించారు. వీరికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు పలికారు. పొలాలు పొట్టకు వచ్చాయని, యూరియా చల్లకుంటే పంట నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. రైతుల ఇబ్బందులు గుర్తించి యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఏవో సంగీత అక్కడికి చేరుకుని మంగళవారం యూరియా నిల్వలు వస్తాయని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. సహకార సంఘ చైర్మన్ రమేశ్‌ను సంప్రదించగా.. యూరియా పంపించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఫసీఉల్లా, మాజీ ఎంపీపీ శంకరయ్య, బీజేవైఎం జిల్లా నాయకుడు మహేశ్, రైతులు అక్కపెల్లి మల్లయ్య, దానవేని శ్రీనివాస్, కందుల మహేందర్, గోపాల్, మల్లేశ్, రాజన్న, రైతులు పాల్గొన్నారు.

అహింసామార్గం చూపిన దార్శనికుడు గాంధీ



నివాళులర్పిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రపంచానికి శాంతి, అహింసామార్గాన్ని చూపించిన దార్శనికుడు జాతిపిత మహాత్మాగాంధీ అని టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా స్థానిక పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రజలను మత ప్రాతిపదికన, రాష్ట్రంలో కేసీఆర్ కులాల ప్రాతిపదికన విడగొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి



గాంధీ విగ్రహం ఎదుట ఆందోళనలో సభ్యులు

మంచిర్యాలటౌన్/జన్నారం: జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల గాంధీ పార్కులోని గాంధీ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.ప్రకాశ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సంపత్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ఐజేయూ సభ్యులు కాచం సతీశ్, బిరుదుల దేవరాజు, దబ్బెట తిరుపతి, కిరణ్‌కుమార్, భాస్కర్, ఎర్రం ప్రభాకర్, రమేశ్, సంతోష్, రాజనర్సు పాల్గొన్నారు. జన్నారంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, జర్నలిస్టులు మల్లేశం, లింగన్న, సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో జోష్ !



రామకృష్ణాపూర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

- అధికారిక, పార్టీ కార్యక్రమాలతో ఎమ్మెల్యేలు బిజీ
- ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఓ దఫా ప్రచారం
- పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు
- నాయకుల వరుస పర్యటనలతో పార్టీలో ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అగ్ర నాయకుల పర్యటనలు జోష్ నింపుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో మళ్లీ గులాబీ జెండా ఎగురవేయాలని సీఎం కేసీఆర్ నుంచి మంత్రుల వరకు వరుసగా పర్యటనలు చేస్తూ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ఉత్సాహాన్నిస్తున్నారు. గత జూన్ తొమ్మిదిన కేసీఆర్ జిల్లా పర్యటనలో కలెక్టరేట్‌తోపాటు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మంచిర్యాల ప్రగతి నివేదన సభ పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. అంతకుముందు మేలో బెల్లంపల్లిలోనూ ప్రగతి నివేదన సభ నిర్వహించి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపడుతున్న పనులను ప్రజలకు వివరించారు. రెండ్రోజుల క్రితం చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి పర్యటన విజయవంతం చేశారు. మూడు నియోజకవర్గాల్లో పర్యటించిన ప్రతీసారి స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి, బీఆర్‌ఎస్ పార్టీ అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలపైనా విమర్శలు చేస్తున్నారు. అటు అసంతృప్తులు ఇటు అసమ్మతి నాయకులు పట్టు జారకుండా, ప్రజల్లో వ్యతిరేకత పెరగకుండా జాగ్రత్త వహిస్తున్నారు.

ప్రజల్లో బలం పెంచుకునేలా..

మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఇప్పటికే కొందరు నాయకులు సైతం పార్టీ మారేందుకు సిద్ధపడ్డారు. కొందరు టికెట్ ఆశించిన జిల్లా స్థాయి నాయకులు సైతం ఉన్నారు. ఇటీవల పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి దంపతుల ప్రభావం చెన్నూరు నియోజకవర్గంలో పడనుంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బలపడితే తమకు ఇబ్బందని ముందస్తుగానే గ్రహించి ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇంకా ఎవరెవరు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారని నిఘా పెట్టి ఎప్పటికప్పుడు వ్యూహాలు రచిస్తున్నారు. ఇక మంచిర్యాల నియోజకవర్గంలో బీసీ నినాదంతో కొందరు నాయకులు విభేదాలతో ఉన్నప్పటికీ పార్టీలో వ్యతిరేకత ఉండే కొందరు పార్టీ మారిపోయారు. నష్టనివారణ చర్యల్లో భాగంగా ఇతర పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేర్చుకునేలా ప్రణాళిక వేశారు. ఓ వైపు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపడితే తమకు వచ్చే ఎన్నికల్లో సమస్యగా మారతుందని ఎప్పటికప్పుడు ఆరోపణలు తిప్పికొడుతున్నారు.

అభివృద్ధి పనుల వేగం

ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసేలా బీఆర్‌ఎస్ అభ్యర్థులు బిజీబిజీగా ఉన్నారు. మంచిర్యాలలో జిల్లా కేంద్రంతోపాటు పట్టణాలు, గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు నిత్యం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే సుమన్, బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య సైతం నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన, ఇంటింటికీ తాగునీరు, రోడ్లు, భవనాల నిర్మాణం, సింగరేణి కార్మిక వాడల్లో ఇళ్ల పట్టాల పంపిణీ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేసే పనిలో నిమగ్నమయ్యారు.

షెడ్యూల్‌కు ముందే ప్రచారం

వచ్చే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈ నెలలో వెలువడే అవకాశం ఉన్నందున ఈలోపే జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఓ దఫా ఎన్నికల ప్రచారాన్ని అధికార పార్టీ పూర్తి చేసినట్లయింది. అటు ప్రభుత్వ ఇటు పార్టీ కార్యక్రమాలను ఒకేసారి నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచారంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. గ్రామ, పట్టణాల్లో లబ్ధిదారులు, సింగరేణి కార్మికులను ఆకర్షించే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం సాగిస్తున్నారు. ఇక అన్ని పార్టీల కంటే ముందుగానే అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడంతో ఎమ్మెల్యేలు అటు అధికారిక, ఇటు పార్టీ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. దీంతో షెడ్యూల్ వచ్చే నాటికే జిల్లాలో ఎన్నికల ప్రచారం పూర్తి చేసే పనిలో ఉన్నారు.

సీఐ, ఎస్సైలపై బదిలీ వేటు..?

- చర్చనీయాంశంగా మారిన వైనం
- ఆ రెండు సంఘటనలే కారణమా..!

బెల్లంపల్లి: బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య, టూ టౌన్ ఎస్సై రవికుమార్ బదిలీ సబ్ డివిజన్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. ఒకేసారి ఇద్దరిని బదిలీ చేయడం, వారి స్థానంలో మరో ఇద్దరిని నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శంకరయ్య స్థానంలో రామగుండం స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న బన్సీలాల్‌ను నియమించగా ఆదివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఎస్సై రవికుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో రమేష్‌ను నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల చోటు చేసుకున్న రెండు ప్రధాన ఘటనలే బదిలీలకు కారణమని తెలుస్తోంది. ఓ హత్య ఘటనలో నిందితులను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కొన్ని కేసుల్లో సరిగా స్పందించకపోవడంతో ఎస్‌హెచ్‌వోపై వేటు వేసినట్లు తెలుస్తోంది. తగాదా పడిన ఘటనలో బాధ్యుడిని టూటౌన్‌కు తీసుకు రాగా కస్టోడియల్ డెత్ అయ్యాడు. ఈ వ్యవహారంలో పోలీసులపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో పోలీసు అధికారులు తీవ్రంగా పరిగణించి బదిలీ చేసినట్లు సమాచారం. మరికొన్ని కేసుల్లో వ్యవహరించిన తీరు కూడా కారణమని ఆరోపణలు వస్తున్నాయి.

పట్టుతప్పుతున్న పోలీసుల తీరు

బెల్లంపల్లిలో కొంతకాలంగా పోలీసులు అనుసరిస్తున్న తీరు సరిగా లేదనే విమర్శలున్నాయి. కొన్ని ఘటనల్లో ఏకపక్షంగా వ్యవహరించడం, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలున్నాయి. గంజాయి క్రయవిక్రయాలకు అడ్డుకట్ట వేయకపోవడంతో యువకులు మత్తుకు అలవాటుపడ్డారు. రహస్యంగా పేకాట సర్వసాధారణమైంది. రౌడీలు, ఆకతాయిల వేధింపులు, బెదిరింపులు పెచ్చుమీరుతున్నా పట్టించుకోకపోవడంతో శాంతిభద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు పోలీసు అధికారులు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

క్రీడా కిట్లు వచ్చేశాయ్..!



హాజీపూర్ మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా ప్రాంగణాల కిట్లు

- 616 క్రీడా ప్రాంగణాలకు 646 కిట్ల మంజూరు
- మండల, మున్సిపాలిటీలకు చేరుకున్న సామగ్రి
- పంపిణీకి ఏర్పాట్లు పూర్తి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం పెంచి.. వెలుగులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. వీటిలో ఏర్పాటు చేసేందుకు స్పోర్ట్స్ కిట్లను ఇటీవల మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లాలోని క్రీడా మైదానాల్లో ఏర్పాటు చేసేందుకు కిట్లు జిల్లాకు చేరుకున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో ఏడాది క్రితం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినా క్రీడా పరికరాలు లేకపోవడంతో ఆటలు ఆడలేని పరిస్థితి నెలకొంది. క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 616 క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి ఇటీవల మంజూరైంది. ఇందులో భాగంగా మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాలకు ఈ క్రీడా పరికరాల కిట్లను తెలంగాణ క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే పంపిణీ చేశారు. పరికరాలతోపాటు ఆటగాళ్లకు టీ-షర్టులు కూడా అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కేంద్రానికి ఒకటి..

జిల్లాలోని 7మున్సిపాలిటీలు, 16 మండలాల్లోని 311 గ్రామ పంచాయతీల్లో కలిపి మొత్తంగా 616 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఈ క్రీడా ప్రాంగణాలకు గతంలో వాలీబాల్ నెట్లు మాత్రమే సరఫరా చేశారు. ఇప్పుడు తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు వచ్చాయి. 616 కిట్లతోపాటు అదనంగా మరో 30 కిట్లను పంపించారు. ఈ కిట్లన్నీ కూడా ఇప్పటికే మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల పర్యవేక్షణలో ఉన్నాయి. ఈ కిట్లను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు త్వరలోనే పంపిణీ చేసి క్రీడా ప్రాంగణాలను అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నారు.

క్రీడా పరికరాలు ఇవే..

- క్రికెట్ కిట్టులో ఉండేవి.. రెండు బ్యాట్లు, రెండు జతల బ్యాటింగ్ గ్లౌజ్‌లు, లెగ్ ప్యాడ్లు, గాడ్స్, వికెట్ కీపింగ్ గ్లౌజ్‌లు, ఆరు ప్రాక్టీస్ బాళ్లు, వికెట్ల సెట్.
- జిమ్‌కు సంబంధించి రెండు డంబెల్స్, 5.5, 7.5 కిలోల బరువు గల డంబెల్స్ రెండు వేర్వేరుగా అందిస్తారు.
- వాలీబాల్, సింథటిక్ నెట్, సైకిల్ పంపు, ప్యాడు, బ్యాగు, డిస్కస్ త్రోలు, ఆరు టెన్నికాయిట్ రింగులు, 4 స్కిప్పింగ్‌లు, రోబ్‌లు, 3 ప్లాస్టిక్ విజిల్స్, టాప్ అండ్ గో వాచ్, 75 టీ-షర్టులు ఉన్నాయి.

త్వరలోనే ప్రారంభం..



గ్రామాలు, మున్సిపాలిటీల్లోని క్రీడా ప్రాంగణాలకు నిబంధనల మేరకు క్రీడా పరికరాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశాం. ఎంపీడీవోలకు, కమిషనర్లకు క్రీడా ప్రాంగణాలకు సంబంధించి క్రీడా పరికరాలు అందించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే క్రీడా ప్రాంగణాలకు కిట్లు చేరవేయించి క్రీడలు ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి

మున్సిపల్ రోడ్లకు మహర్దశ

- రోడ్లు, వివిధ పనులకు రూ.53 కోట్లు
- 5న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- నిర్మాణం పూర్తయిన ఆస్పత్రి భవనం



నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ ఆస్పత్రి

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు సక్రమంగా లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వ విప్ బాల్క సుమన్ నిధుల మంజూరుకు కృషి చేశారు. కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ పర్యటనలో సీఎం కేసీఆర్ జిల్లాలోని మున్సిపాల్టీలకు రూ.25కోట్ల చొప్పున మంజూరు చేశారు. వీటితోపాటు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.28కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.53కోట్లతో ఈ నెల ఐదున రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, 40వరకు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. చెన్నూర్ మున్సిపాల్టీ నుంచి నుంచి జాతీయ రహదారి వరకు రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5.72 కోట్లు, బైరి సత్తన్న ఇంటి నుంచి జాతీయ రహదారి వరకు రూ.3.60 కోట్లు, లైన్‌గడ్డ ప్రాథమిక పాఠశాల నుంచి సీతారాం తోట వరకు రూ.1.62 కోట్లు, గాంధీచౌక్ నుంచి మంగళిబజార్ వయా బడా హనుమాన్ టెంపుల్ వరకు రూ.2 కోట్లు, డబుల్ బెడ్రూం ఇళ్ల అదనపు పనులకు రూ.3కోట్లు, పోచమ్మ ఆలయం వద్ద మూత్రశాలల నిర్మాణానికి రూ.25లక్షలు, అనంతయ్య కుంట మినీ ట్యాంకుబండ్‌కు రూ.4.50 కోట్లు, రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.2 కోట్లు, జంక్షన్లలో హైమాస్ట్ లైట్లకు రూ.65లక్షలు కేటాయించగా పనులను మంత్రి ప్రారంభించనున్నారు. వార్డుల్లో డ్రెయినేజీలు, రోడ్లు తదితర పనులతోపాటు నిర్మాణం పూర్తయిన ఆస్పత్రిని ప్రారంభిస్తారు.

అభివృద్ధే లక్ష్యం



నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిధులు మంజూరు చేయించా. చెన్నూర్ మున్సిపాలిటీలో సుమారు రూ.250 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నాం. కొన్ని పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పనులు సాగుతున్నాయి. అంతర్గత రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.53 కోట్ల నిధులు మంజూరు చేయించా. ఈ నెల 5న మంత్రి చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తాం.

– బాల్క సుమన్, ప్రభుత్వ విప్

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రఘునందన్‌రావు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ శివాజీ ధైర్యం చాలా గొప్పదని, హిందు సనాతన ధర్మం కోసం ఆయన చేసిన త్యాగం తరతరాలుగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, స్వయం సేవక్ సభ్యులు కృష్ణ, మండల నాయకులు హరిగోపాల్, కిషన్, మధు, సతీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్ముడి అడుగు జాడల్లో నడవాలి



పూలమాలలు వేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్
- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

మంచిర్యాలటౌన్: ప్రతి ఒక్కరూ మహాత్ముడి అడుగు జాడల్లో నడవాలని సత్యం, అహింసలను పాటించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో మహాత్ముడి విగ్రహానికి కలెక్టర్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పూలమాలలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అహింస, సత్యాగ్రహంతో మహాత్మాగాంధీ ముఖ్య పాత్ర పోషించారని, బాపూజీగా, జాతిపితగా నిలిచారని అన్నారు. సహాయ నిరాకరణ, స్వదేశీ వస్త్రధారణ వంటి అహింసా మార్గాల్లో స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారని తెలిపారు. అనంతరం అహింసా శాఖాహార ర్యాలీలో పాల్గొన్నారు. శాఖాహారం అమృతాహారం అని, మాంసాహారం వద్దని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, జీవరాశి మనుగడకు సహకరించాలని, మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, సీఈవో కే.నరేందర్, డిప్యూటీ సీఈవో ఆర్.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంలోనే గొప్ప నేత మోదీ

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి
- మోదీ అంటే విశ్వాసం.. కేసీఆర్ అంటే మోసం
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న రఘునందన్‌రావు, వివేక్

మంచిర్యాలటౌన్: ప్రపంచంలోనే గొప్ప నేత నరేంద్రమోదీ అని, 11వ స్థానంలో ఉన్న భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఐదో స్థానానికి తెచ్చిన ఘనత ఆయనదేనని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ చీరలను మాజీ ఎంపీ వివేక్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లతో రాజకీయంగా ముందుకు వచ్చే అవకాశం ఏర్పడిందని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గం నుంచి రఘునాథ్‌రావును గెలిపించాలని కోరారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ మోదీ అంటే విశ్వాసమని, కేసీఆర్ అంటే మోసమని అన్నారు. కేసీఆర్ మోసాలను రాస్తే రామాయణమని, చెబితే భాగవతమని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డి కోర్టు మెట్లు ఎక్కకుండా కేసీఆర్ కాపాడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, కవితలకు వ్యాపారాల్లో భాగస్వామ్యం ఉందని, అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

ఇంటర్ విద్యార్థులు కళాశాల మారొచ్చు

- మీడియం, గ్రూపుల మార్పుకు అవకాశం
- ఈ నెల 16వరకు తుది గడువు

మంచిర్యాలఅర్బన్: ఈ విద్యాసంవత్సరం 2023-24 ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఇష్టమైన కళాశాలలో చేరేందుకు అవకాశం కల్పించింది. ఇష్టంలేని కళాశాలల్లో చేరి ఇబ్బందులు పడుతున్న వారికి కాస్త వెసులుబాటు లభించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రైవేట్‌లోకి, ప్రైవేట్ నుంచి ప్రభుత్వ కళాశాలల్లోకి మార్పు కోరుకుంటున్న వారికి ఊరటనిస్తోంది. కళాశాలలతోపాటు సెకండ్ లాంగ్వేజ్, మీడియం, గ్రూపు మార్పు దరఖాస్తుకు ఈ నెల 16వరకు అవకాశం కల్పించారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై మూడు నెలలు పూర్తవుతున్నా మొదటి సంవత్సరం విద్యార్థులు(ఆన్‌టీసీ ట్రాన్స్‌ఫర్) కోరుకున్న కళాశాలలకు మార్పు చేసుకోవచ్చు. జిల్లాలో 66 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 10 ప్రభుత్వ, 36 ప్రభుత్వ సెక్టార్, 20 ప్రైవేట్ కళాశాలలు ఉండగా 8,623 మంది మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిలో కొందరు తమకు నచ్చిన కళాశాలకు మారే అవకాశం లేకపోలేదు. ప్రైవేట్ నుంచి ప్రభుత్వ కళాశాలలకు మారే విద్యార్థులకు సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ప్రైవేటు యాజమాన్యం ఫీజులు, ఇతర కారణాలు చూపి మడతపేచీ పెట్టే వీలుంది. ఇబ్బందులు లేకుండా ఇంటర్మీడియెట్ అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

జ్వరంతో యువకుడు మృతి


నాగరాజు(ఫైల్)

దహెగాం(సిర్పూర్): జ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోత్మీర్ గ్రామానికి చెందిన మిట్ట నాగరాజు(24) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా ఆర్‌ఎంపీ వైద్యుల వద్ద చికిత్స చేయించారు. ఆదివారం జ్వరం తీవ్రం కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. జ్వరంతో పాటు పచ్చకామెర్లు కూడా సోకినట్లు వారు పేర్కొన్నారు. పదిహేను రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ అనే నాలుగేళ్ల బాలుడు సైతం జ్వరంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని ముత్యంపేటలో ప్రమాదవశాత్తు ఒకరు బావిలోపడి మృతి చెందినట్లు ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపారు. ముత్యంపేటకు చెందిన బోనగిరి శ్రీనివాస్ (45)కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేదు. సోమవారం ఉదయం తనకున్న కిరాణా దుకాణం తెరిచేందుకు వెళ్లాడు. కొంతసేపటి తర్వాత అతని భార్య సుజాత షాపు వద్దకు వెళ్లిచూడగా మూసివేసి ఉంది. అతనికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. అతనికోసం వెతుకుతుండగా ముత్యంపేట నుంచి రెబ్బనపల్లికి వెళ్లే దారిలో గల వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో రోడ్డు వెంట వెళ్తుండగా ప్రమాదవశాత్తు బావిలో జారిపడి ఉంటాడని సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సోమగూడెంలో చోరీ

కాసిపేట(బెల్లంపల్లి): కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెంకు చెందిన ఫోర్‌లైన్ పక్కన గల ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. సోమగూడెంకు చెందిన అచ్చే అర్జయ్య కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 23న ముంబయిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఇంటితాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. సోమవారం ఇంటిని గమనించిన అర్జయ్య మేనల్లుడు రాగుల సతీష్ చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉన్న తొమ్మిదిన్నర తులాల బంగారం, 10 తులాల వెండి అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వాటి విలువ సుమారు రూ.6.50 లక్షలు ఉన్నట్లు తెలిపారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలటౌన్: ఈ నెల 1, 2 తేదీల్లో జగిత్యాల జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 7 బంగారు పతకాలు, 13 వెండి పతకాలు సాధించినట్లు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చి రామారావు, వెంకటస్వామి తెలిపారు. వచ్చే నెలలో ఢిల్లీలో జరుగనున్న జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం తైక్వాండో శిక్షకులు మండ శ్రీనివాస్, శ్రావణ్, అజయ్, రోహిత్ అభినందించారు.

కార్మికశాఖలో అక్రమాలకు చెక్

- క్లెయిమ్ కావాలన్నా కార్డు పొందాలన్నా వేలిముద్ర వేయాల్సిందే
- లబ్ధిదారుకు నేరుగా బీమా సొమ్ము చేరేలా చర్యలు
- ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తూ నిర్ణయం



కార్మికశాఖ కార్యాలయం

మంచిర్యాలక్రైం: కార్మికశాఖలో అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆశాఖ ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తూ సరికొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన సేవలు అందించేందుకు పూనుకుంది. లబ్ధిదారులకు నేరుగా బీమా సొమ్ము అందేలా ప్రభుత్వం, కార్మిక శాఖ దరఖాస్తుల విధానాన్ని మరింత కట్టుదిట్టం చేసి అమలు చేస్తోంది. శాఖలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు వేలిముద్ర(ఫింగర్ ప్రింట్) విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసి కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించి లేబర్‌కార్డు పొందేవారు. కానీ ప్రస్తుతం కార్మికుడి వేలిముద్ర లేనిదే కార్డు పొందలేరు. కార్మికుడి కుమార్తె వివాహం, డెలివరీకి వచ్చే బీమా సొమ్ము పొందాలన్నా కార్మికుడు నామినీ వేలిముద్రలు వేయడం తప్పనిసరి చేశారు. అయితే కొంతమంది కార్మికుల వేలిముద్రలు పడక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాత విధానాన్నే కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

వేలిముద్ర తప్పనిసరి...
బీమా సొమ్ము నేరుగా లబ్ధిదారుడికి చేరేలా వేలిముద్ర విధానాన్ని కార్మికశాఖ అమలు చేస్తోంది. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు క్లెయిమ్‌లు, కొత్త కార్డుల కోసం కూడా వేలి ముద్రవేస్తేనే ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఈ విధానం ద్వారా ఏజెంట్లు, దళారులకు బీమా సొమ్ము చేరకుండా నేరుగా కార్మికుడి బ్యాంకు ఖాతాలో జమ కానుంది.

దళారులను ఆశ్రయించొద్దు

కార్మికులు దళారులను నమ్మి మోసపోవద్దు. నేరుగా కార్మికశాఖ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలి.ఆన్‌లైన్ చేసిన దరఖాస్తు ఫారాలను నేరుగా తీసుకువచ్చి కార్యాలయంలో అందజేయాలి. క్లెయిమ్‌లు, దరఖాస్తులు చేసుకునేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఏజెంట్లు, దళారుల ప్రమేయం ఉండదు. **– వినీత, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, మంచిర్యాల**

అక్రమాలు జరుగకుండా...
గతంలో లేబర్‌కార్డు పొందాలన్నా, బీమా సొమ్ము కార్మికుడి ఖాతాలో జమ కావాలన్నా ఏజెంట్లు చెప్పింది విని వారు అడిగిన కాగితాలు ఇచ్చేవారు. దీంతో వారే స్వయంగా ఆన్‌లైన్ చేసి సంబంధిత కార్యాలయంలో అప్పగించేవారు. దీంతో బీమా సొమ్ము దళారులు కాజేసిన సంఘటనలు ఉన్నాయి. ఈక్రమంలో వేలిముద్ర విధానం అమలుచేస్తూ లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తోంది. ఈ విధానంవల్ల దళారీ ఏజెంట్ల వ్యవస్థ తగ్గనుంది.

వర్షాలతో పత్తికి చీడపీడల బెడద

- రాలుతున్న గూడ
- ఆందోళనలో రైతన్నలు


రాలిన గూడను చూపిస్తున్న రైతు

చెన్నూర్‌రూరల్: ఇటీవల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఈ ఏడాది వానాకాలంలో చెన్నూర్ మండలంలో 17,837 ఎకరాల్లో వరి, 13 వేల ఎకరాల్లో పత్తి, 400ల ఎకరాల్లో మిర్చిపంటలు సాగు చేశారు. ప్రస్తుతం పత్తి మొక్కలు పూత వచ్చి గూడ దశ నుంచి కాయదశకు చేరుకుంటున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తిపంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. పచ్చదోమ, తెల్లదోమ ఆశిస్తే పత్తి మొక్కల అడుగు భాగం నుంచి పత్రహరితాన్ని పీలుస్తాయి. దీని వలన ఆకులు మొదట పచ్చబారి, ఆ తరువాత ఎర్రబారడం జరుగుతుంది. దీంతో ఆకులు కింది వైపుకు ముడుచుక పోతాయి. చెట్టు కొనలు ముడుచుకు పోయి పెరుగుదల తగ్గి, పూత, కాత తగ్గుతుంది. ఈ పురుగులు రసం పీల్చడంతో గూడలు బలహీన పడి రాలిపోతాయి. అలాగే పిందె పరిమాణం కూడా తగ్గడంతో పంట దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. వేలకువేలు పెట్టుబడి పెట్టి పత్తి సాగుచేస్తే అధిక వర్షాలతో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి



పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణ కోసం ఎసిటా మిప్రిడ్ 30 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. మూడు రోజుల తరువాత మరోసారి పిచికారీ చేసుకోవాలి. లేదా 250 గ్రాముల ఎసిఫేట్ మందును 150 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులను నివారించవచ్చు.
– కవిత, ఏవో, చెన్నూర్

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా..!

- రాత్రికి రాత్రే వెలిసిన టేలాలు
- 'మాములు'గా తీసుకుంటున్న అధికారులు


అక్రమంగా వెలసిన టేలాలు

మంచిర్యాలక్రైం: తెలంగాణ ఏర్పడిన తర్వాత మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పాటైన నాటి నుంచి జిల్లా కేంద్రంలో ఎక్కడ పడితే అక్కడ ఖాళీగా జాగ కనిపిస్తే చాలు అక్కడ పాగా వేసేయడమే పనిగా పెట్టుకున్న కొందరు అధికార పార్టీ నాయకుల అండదండలతో రాత్రికి రాత్రే అక్రమంగా టేలాలు వేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని రెండు టేలాలు రాత్రికి రాత్రే ఏర్పాటు కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌ను వివరణ కోరగా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. బాలికల పాఠశాల ప్రహరీని ఆనుకుని వేసిన టేలాలు తొలగిస్తాం. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పాముకాటుతో ఇద్దరు మృతి

చింతలమానెపల్లి: కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్–2 గ్రామానికి చెందిన రవీంద్ర మండల్(38) సోమవారం పాముకాటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రవీంద్ర ఆదివారం సాయంత్రం స్థానికంగా చేపలు పట్టడానికి వెళ్లి వచ్చాడు. సోమవారం తెల్లవారు జామున అస్వస్థతకు గురికావడంతో పాము కాటు వేసినట్లు గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శేషుపల్లిలో ఆటోడ్రైవర్..
రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని శేషుపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నంది వెంకటస్వామి (35) పాముకాటుతో మృతి చెందాడు. మూడు రోజుల క్రితం వెంకటస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఎన్‌సీసీ దేశభక్తిని పెంపొందిస్తుంది

- లెఫ్టినెంట్ కల్నల్ వికాస్
- ఉమ్మడి జిల్లా వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ వికాస్

ఆదిలాబాద్: ఎన్‌సీసీ శిక్షణ దేశభక్తిని పెంపొందిస్తుందని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వికాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 32–టీ బెటాలియన్ ఎన్‌సీసీ జాయింట్ ఆన్వల్ ట్రైనింగ్ క్యాంపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ఎంతో క్రమశిక్షణ నేర్చుకునేలా చేస్తుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, సాంస్కృతిక అంశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు ఎన్‌సీసీ కేడేట్లు గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండర్ కెప్టెన్ జగ్ రామ్, ఎన్‌సీసీ అధికారులు ఆనంద్‌రావు, శ్రీనివాసరావు, రాజానందం, నరేందర్, వందన, స్వరాజ్ సింగ్, రవీందర్, సుబేదార్ మేజర్ ఆనంద్ కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్ తేజ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఆరెగూడ, మోసం గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై సోమవారం ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్న బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. మోసం గ్రామానికి చెందిన నేతుల తిరుపతి 15 లీటర్ల గుడుంబా క్యాన్‌తో వెళ్తుండగా పట్టుకున్నామని ఎస్సై తెలిపారు. గుడుంబాను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బెజ్జూర్: పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగుల్వాయి గ్రామానికి చెందిన టాకిరే భీమయ్య (52) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య టాకిరే తారాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

భూతగాదాలో ఇరువురిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామానికి అంగల శ్రీనివాస్, అంగల గణేశ్ భూతగాదా విషయంలో ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సబ్‌జైలులో పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్

లక్సెట్టిపేట: గాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సబ్ జైలులో సోమవారం అండర్ ట్రయల్ ఖైదీలకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, మార్పు తెచ్చుకోవాలని సూచించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ఖైదీలుగా శిక్ష అనుభవించవద్దన్నారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్ర రావు, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, జైలర్ స్వామి, సీఐ క్రిష్ణ, ఎస్సై లక్ష్మణ్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

మంచిర్యాలఅర్బన్: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామన్న, రాజావేణు డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌తో పాటు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీ అమలుకావడం లేదన్నారు. తక్షణమే బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న 'చలో సంక్షేమ భవన్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేతకానిలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి



మాట్లాడుతున్న దుర్గం రాజేశ్

- నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్

నస్పూర్: రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు నేతకానిలకు ప్రాతినిధ్యం కల్పించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన వారిలో అత్యధికంగా మూడోస్థానంలో కలిగిన నేతకాని కులంలో సమర్థులైన నాయకులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో 19 ఎస్సీ రిజర్వేషన్ల అసెంబ్లీ స్థానాలు ఉన్నాయని, అందులో అత్యధికంగా నేతకాని జనాభా కలిగిన ఓట్లు ఉన్నాయన్నారు. సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కామెర ప్రకాష్, నాయకులు దుర్గం నాగేష్, సంతోష్, యువరాజ్, శంకర్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


పోటీలు ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

- మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్
- ఉమ్మడి జిల్లా క్రీడాపోటీలు ప్రారంభం

ఆదిలాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో సోమవారం బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 19 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగిన క్రీడలలో తగిన ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. ఆర్సీవో గోపిచంద్, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, రుక్మారెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో అధికారుల శ్రమదానం


శ్రమదానం చేస్తున్న జీఎం, అధికారులు

జైపూర్: స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో అధికారులు శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా జీఎం బసివిరెడ్డి, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్‌తో కలిసి అధికారులు పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా జీఎం బసివిరెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని, తద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు వాసుదేవమూర్తి, ఆజాజుల్లాఖాన్, సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఎస్టీపీపీ అధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్, ఫారెస్టు అధికారి చంద్రమణి, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

'బెల్లంపల్లి సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి'


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆదిలాబాద్‌కు వచ్చిన కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కొత్తగా భూగర్భ గనులను బెల్లంపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, రిక్రూట్‌మెంట్ విధానాన్ని మార్చాలని, పరుగు పందెం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించాలని, ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించి సాగు, తాగునీరు అందించాలని, వ్యవసాయ అనుబంధ రంగాలను ఏర్పాటు చేయాలని అందులో కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, నాయకులు బత్తుల రవి, భీమయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

'మహిళా రిజర్వేషన్‌లో సబ్‌కోటా ప్రకటించాలి'


సత్యాగ్రహ దీక్ష చేపట్టిన నాయకులు

పాతమంచిర్యాల: మహిళా రిజర్వేషన్ బిల్లును అనుసరించి బీసీ మహిళలకు సబ్‌కోటా ప్రకటించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు గజెల్లి వెంకటయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఏసీసీలో సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం బీసీలలో 30 శాతం మహిళలే ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ మహిళల జనగణన చేపట్టకముందే హడావిడిగా ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించి మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకువచ్చారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళల వాటా ప్రకటించిన తర్వాత బిల్లు పాస్ చేయాల్సి ఉండేదన్నారు. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ బిల్లులో మార్పులు చేసి బీసీ మహిళలకు సబ్‌కోటా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, నాయకులు రాసమల్ల కుమార్, శ్రీపతి రాములు, ఆరెందుల రాజేశం, జంబోజు శ్రీనివాస్, అంకం సతీష్, గన్నవరం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు

- మండలంలో జోరుగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు


మేదరిపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద (ఫైల్)

దండేపల్లి: మండలంలో గంజాయి గుప్పుమంటోంది. ఇతర ప్రాంతాల నుంచి కొందరు మండలానికి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. విక్రయాలు జోరుగా సాగుతుండగా గంజాయికి అలవాటుపడిన యువత మత్తులో తేలిపోతున్నారు. మండలంలోని మేదరిపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇటీవల గంజాయి తాగిన ఆనవాళ్లు లభించాయి. ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోకపోవడం, సమన్వయం లోపించడం వల్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇంటర్, డిగ్రీ చదివే వారితోపాటు 9, 10వ తరగతులు చదివి మానేసిన వారు కొందరు గంజాయి బారిన పడినట్లు తెలిసింది. మండలంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో చీకటి పడగానే గుంపులు గుంపులుగా చేరుకుని గంజాయి తాగుతున్నారు. ఆ సమయంలో వాహనాలు ఉంటే వేగంగా వెళ్లడం, పిచ్చిగా ప్రవర్తించడం చేస్తున్నారు. మండల కేంద్రంతోపాటు మేదరిపేట, తాళ్లపేట, గోదావరి తీర ప్రాంతాల్లో గంజాయి వాడకం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై కుందారపు ప్రసాద్‌ను సంప్రదించగా గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

వేతనాలపై వీడిన పీటముడి

- ఈ నెల 2న తయారుకాని పేషీట్
- ఆందోళన చెందిన సింగరేణి ఉద్యోగులు
- యూనియన్ నేతల జోక్యంతో నేడు వేతనాల చెల్లింపు

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రతీనెల 2వ తేదీ ఉదయం నాటికి తయారు కావాల్సిన పేషీట్ తయారు కాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. బొగ్గు గని కార్మికులకు 11వ వేతన ఒప్పందంకు సంబంధించిన కొత్త వేతనాలు నిలిపివేయాలని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్ కోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. దీనిపై కోలిండియాలో ఈ నెల వేతనాల చెల్లింపు ప్రతిష్టంభనగా మారింది. సింగరేణి కంపెనీ కూడా ఈ తీర్పును అమలు చేయాలా? వద్దా? అనే దిశగా ఆలోచన చేయడంతో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. చివరికి పీటముడి వీడింది.

కార్మిక సంఘాల చొరవతో...
బొగ్గు గని కార్మికులకుల 11వ వేతన ఒప్పందం మే నెలలో జరిగింది. దీని ప్రకారం మూడు నెలలుగా కొత్త వేతనాలు చెల్లిస్తున్నారు. ఇటీవల బొగ్గు గని అధికారుల సంఘం నాయకులు జబల్‌పూర్ కోర్టులో కేసు వేశారు. తమ ఈ 3 గ్రేడ్ అధికారుల వేతనాల కంటే ఏ 1 గ్రేడ్ ఉద్యోగుల వేతనాలు ఎక్కువగా పెరిగాయని, ఇది డీపీఈ గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా ఉందని కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఉద్యోగుల కొత్త వేతనాలను నిలిపివేయాలని కోలిండియా యాజమాన్యాన్ని ఆదేశించింది. దీనిపై కోలిండియా అప్పీలుకు పోతున్న నేపథ్యంలో జేబీసీసీఐ 11ను అమలు చేస్తున్న సింగరేణి కూడా కోర్టు ఉత్తర్వులపై ఎలా నడుచుకోవాలని సోమవారం మల్లగుల్లాలు పడింది. మూడు నెలల పాటు కొత్త వేతనాలు చెల్లించి, చివరికి ఏరియర్స్ కూడా చెల్లించిన నేపథ్యంలో ఇప్పుడు కోర్టు తీర్పు ప్రకారం కొత్త వేతనాలు నిలిపి వేసి పాత వేతనాలు చెల్లిస్తారా? అన్న సందేహం నెలకొంది. ఉద్యోగుల పేషీట్ ప్రక్రియను కంపెనీ ఒకరోజు జాప్యం చేసింది. ప్రతీనెల 1న పే షీట్ తయారు చేస్తారు. 2న కంప్యూటర్లలో జనరేట్ అయి ఉంటుంది. కానీ సోమవారం కంప్యూటర్లలో పే షీట్ డిసేప్లే కాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. కార్మిక సంఘాల నాయకులు కంపెనీ ఉన్నతాధికారులను ఫోన్‌లో సంప్రదించారు. వేతనాలు ఆపవద్దని మంగళవారం పేమెంట్ చేయాలని కంపెనీ డైరెక్టర్లను తమ యూనియన్ నాయకత్వం కోరడంతో వెంటనే స్పందించి పేషీట్‌లు సిద్ధం చేసిందని, 3న వేతనాలు చెల్లించడానికి ఒప్పుకున్నారని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి తెలిపారు.